# తెలుగులో పౌరాణిక కథా సాహిత్యం

సిహెచ్. పూర్ణచంద్రరావు, పరిశోధక విద్యార్థి ఉ.వి., ఫోన్ : 9491881910

భారతీయ చరిత్రలో ఆదిమ యుగం నుండి వేల సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రతికాలంలోనూ పలుమార్పులు సంభవించాయి. ఈ భూమి మీద మానవుడు పుట్టింది మొదలు సమూహాలుగా ఏర్పడటం, నదీలోయల్లో జీవించటం, జీవనాధారం కోసం వేటాడటం, పోడు వ్యవసాయం చేయటం, సమూహాలు జనపదాలు కావడం, గ్రామీణ స్వయంపోషక వ్యవస్థ మొదలు కావడం, వృత్తులు ఏర్పడటం, ఆ తర్వాత వృత్తులు కులాలుగా రూపాంతరం చెందటం, గణతెగలు ఏర్పడటం, తెగల మధ్య ఉనికి కోసం పోరాటాలు సాగటం, వర్ణవ్యవస్థ, మనువాదం, పితృస్వామిక వ్యవస్థ వంటి రూపాలు ఈ నేలమీద ఉనికిని పొందటం, గణతెగల వ్యవస్థ స్థానంలో రాజ్యాలు ఏర్పడటం, రాచరికం మొదలు కావటం, ఆర్య ద్రావిడ వర్గాల మధ్య సంపదల కోసం, స్త్రీల కోసం పోరాటాలు సాగటం, సమాజంలో ఈ హైందవ వ్యవస్థ మీద ఒక విధమైన అంతర్గత తిరుగుబాటు ఆరంభం కావటం, జైనం, బౌద్ధం వంటి మతాలు లేదా మార్గాలు సమాజంలో ఆదరణ పొందడం, సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు సామాజిక దురాచారాలు ఒకతరం నుండి మరొక తరానికి వారసత్వంగా రావడం వంటి మానవ పరిణామాలు సాగాయి.

వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, పురాణాలు ఇవన్నీ ప్రాచీన సాహిత్యం. ఈ సాహిత్యం లిఖితరూపానికి ముందు మౌఖిక రూపంలో జనపదంలో భాగంగా ఉన్నాయి. కవులు వేదాల నుండి ఉపకథలను స్వీకరించి వాటిని రెండింతలు మూడింతలుగా పెంచి పురాణాలను రాశారు. ఈ పురాణాలు ప్రాచీన కాలంనుండి మధ్యయుగాల దాకా వెలువడినట్లు సాహిత్యకారులు తెలిపారు. ఈ పురాణాలలో ప్రపంచోత్పత్తి వికాస క్రమం, సూర్యచంద్రుల వంశానుక్రమం, భగవంతుని అవతారం, దేవుళ్ళు, దేవతల పుట్టుక, దేవ మానవ సంబంధాలు, మహర్షులు వారి, తపోఫలాలు, దేవదానవ యుద్ధాలు వంటి అంశాలు కనిపిస్తాయి. ఈ పురాణాలు ఇహలోకం, పరలోకం, ధర్మం, న్యాయం, స్వర్గం, నరకం, సత్యం, అసత్యం వంటి విషయాలు కలిగి మానవుని భక్తిమార్గంలో నడిపించడానికి సహాయకారి అవుతాయి.

ప్రధానంగా ఈ పురాణాలు ప్రాచీన భారతంలో పలుజాతుల సమ్మిళితంగా ఏర్పడిన హైందవమతం దాని మార్పులను వివరిస్తాయి. అలాగే ఆర్యులు భారతావనికి చేరి, నాటి భారతీయ గణ తెగలతో సంపదల కోసం, రాజ్యాలకోసం పోరాటం చేయడం, ఆర్య సంస్కృతిని ప్రచారం చేయడంలో భాగంగా జరిగిన పరిణామాలకు ఈ పురాణాలు అక్షర రూపాన్నిచ్చాయి. ఈ పురాణ సాహిత్యం సమాజంలో వేల సంవత్సరాలు ప్రచారం పొందింది. నేటికీ పొందుతూనే ఉంది. కానీ ఆంగ్లేయులు ఈ దేశపాలకులు కావడం, ఆంగ్ల సాహిత్యాన్ని భారతీయులు అభ్యసించడం, ఆధునిక భారతదేశంలో బాల్య వివాహాలు, వితంతువు సమస్య, వరకట్నం, ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం వంటివి అధికం కావడం, సమాజంలో సాంఘిక దురాచారాలు ప్రబలటం, నిరక్షరాస్యత అధికం కావటం, భారతీయులు పరాయి పాలనలో మగ్గటం వంటి అంశాలు భారతీయులను ఆలోచింపజేశాయి. భారతీయ సమాజంలో జాతీయోద్యమం, సంఘ సంస్కరణోద్యమం వంటి ఉద్యమాలు బయలుదేరాయి. దాంతో భారతీయ సాహితీవేత్తలు కల్పిత సాహిత్యాన్ని సృష్టిస్తూనే మరోవైపు వర్తమాన సామాజిక సమస్యలను అధ్యయనం చేయడం, వాటిని సాహితీవస్తువులుగా స్వీకరించి సృజనాత్మక సాహిత్యంగా రాయటం మొదలు పెట్టారు. ఇందుకు పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలైన నవల, నాటకం, కవిత్వం, కథానిక, విమర్శ వంటి ప్రక్రియలను మార్గాలుగా ఎంచుకున్నారు. అలా ఆధునిక సాహిత్యం రావడం మొదలైంది.

తెలుగు కథ 1910లో పుట్టింది కానీ 1902లోనే తెలుగు కథ పుట్టిందని స్త్రీవాదుల అభిప్రాయం. ఈ వందేళ్ళలో తెలుగు కథ భారతీయ సమాజంలోని ప్రతి సమస్యను ఎత్తి చూపుతూ వాటికి పరిష్కార మార్గాలను కూడా సూచించింది. ఈ వందేళ్ళ కాలంలో మెజారిటీ రచయితలు సమకాలీన సామాజిక సమస్యలను, ఇతివృత్తాలుగా రాసినా కొందరు రచయితలు మాత్రం పురాణాంశా లను ఇతివృత్తాలుగా స్వీకరించి కథలను సృష్టించారు. మనుషుల్లో నిరంతరం స్వార్థం పెరుగుతూ మానవతా విలువలను కోల్పోతున్న ఈ సమాజంలో మనుషులకు నీతి, న్యాయం, ధర్మం వంటి మానవతా విలువలు ఇంజెక్ట్ చేయడానికి ఈ కథలు ఉన్నతంగా ఉపయోగ పడతాయి అని చెప్పవచ్చు. ఈ వందేళ్ళ కాలంలో పురాణ సాహిత్యానికి సంబంధించిన ఆధునిక తెలుగు కథలు చాలా వెలువడ్డాయి.

తెలుగులో పౌరాణిక జీవితం ఇతివృత్తంగా వెలువడి లభించిన మొదటి కథ "మన్మథ సందర్శనం". రచయిత చింతా దీక్షితులు. ఈ కథ 1921లో ప్రచురించబడింది. ఈ రచయిత ప్రచురించిన ఏకాదశి కథలు సంపుటిలో ఉంది. 1921కి ముందు వెలువడిన పౌరాణిక కథా సాహిత్యం లభ్యం కావాల్సి ఉంది.

ఈ నాగరిక సమాజంలోని మానవ జీవితంలో ప్రతిదశలోనూ

Scanned with CamScanner

స్త్రీ పురుషుల మధ్య ప్రేమ చిగురిస్తుందనేది "మన్మథ సందర్శనం" కథాంశం. ఈ సమాజంలో మనుషుల మధ్య నాగరికత పెరిగే కొద్ది మన్మథుని దగ్గర రకరకాల పూలబాణాలు పెరుగుతున్నాయట. కథలో కథకుడు దేవలోకం వెళ్ళి వాయుదేవుని సహాయంతో మన్మథుని సందర్శించడానికి వెళ్ళి అతని ఆయుధాగారంలో పూల బాణాలు చూసి వెనుతిరగడం కథాంశం.

ఈ పౌరాణిక కథల్లో అధికభాగం స్త్రీ పాత్రలే దర్శనమిస్తాయి. ఈ కథల్లో పురాణ స్త్రీలు దర్శనమిస్తారు. ఇందులో ప్రధానంగా స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, స్వయంశక్తి వంటి అంశాలు దర్శనమిస్తాయి. పురాణ కాలమంతా పితృస్వామ్య వ్యవస్థలో భాగంగా సాగింది. చాతుర్వర్ణ వ్యవస్థ, అస్పృశ్యత కొనసాగాయి. కులాల మధ్య అంతరాలు బాగా ఏర్పడ్డాయి. కానీ దేవలోకంలోని స్త్రీ పురుషుల మధ్య శృంగార పరంగా కొంత స్వేచ్ఛ ఉండటం, వివాహంతో సంబంధం లేని స్త్రీ పురుష సంబంధాలను కొనసాగించడం, భర్తల శాపాలకూ, కోపాలకు బలైన స్త్రీలు అరణ్యంలో ఆశ్రమాలలో జీవించడం, పురాణ పురుషులు తపఫలాలను పొందడం, రాజులు రాజ్యపాలనలో యుద్ధాలు చేయడం, ధనాశ, రాజ్యకాంక్ష, స్త్రీలోలత్వం కారణంగా ఇతర రాజ్యాలపై దండెత్తడం వంటి అంశాలు కనిపిస్తాయి. ఇలాంటి అంశాలను వ్యక్తపరచిన పౌరాణిక కథలను పరిశీలిద్దాం.

స్త్రీ పురుషుల శరీరాలు పరస్పరం ఆకర్షితం. ఇది పురాణ పురుషులలో చాలా అధికం. వీరిది హద్దుల్లేని స్వేచ్ఛ, ప్రేమ పేరుతో పురాణ స్త్రీ పురుషులు దగ్గర కావటం, వైవాహిక జీవితాన్ని గడపడం, సంసార జీవనంలో ఎడబాటు కలగడం, వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో వేరుపడి జీవించటం వంటి అంశాలు ఈ కథల్లో కనిపిస్తాయి. "వరూధిని" (చింతా దీక్షితులు) కథలో వరూధిని హిమాలయాలకు వచ్చిన ప్రవరుని తొలిచూపులోనే మోహించి వివాహమాడాలనుకోవడం, అయినా ప్రవరుడు వరూధినిని వదిలి అష్టకష్టాలు పడి తమ ఇల్లు చేరుకోవడం కనిపిస్తుంది. "ప్రేమాయ" (కస్తూరి మురళీకృష్ణ) కథలో శంతనుడు గంగాదేవిల వైవాహిక జీవితం, గంగాదేవి తనకు పుట్టిన ఏడుగురు కొడుకులను గంగలో వదలడం, ఎనిమిదవ కొడుకును పెంచి శంతనుడికి ఇచ్చి, గంగ శంతనుడికి దూరం కావడం కనిపిస్తుంది. "ప్రమద్వర" (ముక్తేవి భారతి) కథలో భృగుమహర్షి మనుమడు రురుడు మేక గంధర్వ రాజుల కుమార్తె ప్రమద్వరను ప్రేమించి నాగుపాము కాటుతో మరణించిన ఆమెను తమ తపోబలంతో బ్రతికించి వివాహమాడటం కన్పిస్తుంది. "జరుత్కారువు" (డా.ముక్తేవి భారతి) కథలో నాగకన్య వివాహం మహాముని జరుత్కారుడితో జరగటం, ఆ తరువాత జరుత్కారుడు ఆవేశంతో వారి వైవాహిక జీవనం విఫలం కావడం కనిపిస్తుంది. "ఆండాళ్ ప్రేమకథ" (వాడ్రేవు చినవీరభద్రుడు) దేవుడయిన శ్రీకృష్ణుని ప్రేమించటం, అతని ప్రేమలో తన్మయత్వాన్ని పొందటం శ్రీకృష్ణుడు ఆమెను వివాహమాడటం కనిపిస్తుంది. భక్తి ఉద్యమాన్ని గుర్తు చేసిన కథ. ఇలా ఈ పౌరాణిక కథలో దేవ మానవవుల మధ్య ప్రేమ వివాహాలు సాగటం, ఋషుల తపోఫలాలను దేవకన్యలు పొందడం, తమ జీవితాలను సాఫల్యం చేసుకోవడం మనం చూడవచ్చు.

పురాణకాలంలో స్త్రీ జీవితం పితృస్వామిక వ్యవస్థలో ఒక భాగంగా నడిచినా పురాణ స్త్రీలు మాత్రం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం నీడన జీవించారు. తమ కుటుంబాల నుండి స్వేచ్ఛను సాధించుకున్నారు. "కృష్ణార్పణం" (వరిగొండ కాంతారావు) కథలో శ్రీకృష్ణుడి ఎనిమిది మంది భార్యలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపడం కనిపిస్తుంది. వర్తమానంలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు ప్రతిబింబం ఈ కథ. "అశోకం" (ఓల్గా) కథలో రావణుడు అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసి లంకను నిర్మిస్తాడు. ఆర్యుల రాచరిక వ్యవస్థను నిర్మించే ప్రయత్నం చేస్తాడు. దాంతో ఈ ప్రాంతం ధ్వంసం చేసినందుకు తీవ్రంగా దుఃఖిస్తుంది మండోదరి. దాంతో రావణుడు మండోదరికి లంకలో అశోకవనాన్ని నిర్మించడం కథలో కనిపిస్తుంది. మండోదరి ఆటవిక స్త్రీ. అరణ్యాన్ని ప్రేమిస్తుంది. "హిడింబి పరిహాసం" (పిలకా గణపతిశాస్త్రి) కథలో హిడింబి భర్త భీమునికి దూరంగా అడవిలో తన కొడుకు ఘటోత్కచునితో కలిసి ఏకాంత జీవితం గడపడం ఉంది. 'సాధ్వి' (యం.వి.రమణారెడ్డి) కథలు పితృవాక్య పరిపాలకుడైన శ్రీరామునికి లవకుశులను అప్పగించి సీత భూదేవిలో కలిసిపోవడం, మరో కథ 'సీత' (సౌధా) అశ్వమేధయాగం తర్వాత శ్రీరామునితో కలిసి అయోధ్యకు పోవడానికి సీత నిరాకరించడం కనిపిస్తుంది. 'సమాగమం' (ఓల్గా) కథలో ముక్కుచెవులు తెగిన శూర్పణఖ దృఢకాయుడైన సుధీరను వివాహమాడి అడవిలో ఆశ్రమ జీవితం గడపడం కనిపిస్తుంది. 'మృణ్మయనాదం' (ఓల్గా) కథలో మనువాదంలో భాగంగా శౌచం, మైల, పవిత్రం, అపవిత్రం, శీలం, పతనం వంటి పదాలు ఎంతో బలంగా నిలిచాయంటే వీటిముందు రామబాణం, బ్రహ్మాస్త్రం వంటి బాణాలు కూడ వీగిపోతాయనే భావన కనిపిస్తుంది. ఈ కథలో ఆర్య సంప్రదాయంలో భాగంగా అహల్య పడే కష్టాలు కనిపిస్తాయి. 'సైకత కుంభం' (ఓల్గా) కథలో జమదగ్ని మహాముని భార్య రేణుక శీలం పేరుతో కొడుకుతో నరకబడి గిరిజన స్త్రీలతో ప్రాణం పొంది ఏకాంతంగా అడవిలో ఆశ్రమంలో ఉంటూ 'సైకత కుంభం' (ఇసుకతో కుండను చేయటం) చేస్తూ గడపటం కన్పిస్తుంది. హైందవ పాతివ్రత్య ధర్మాలను పితృస్వామ్యాన్ని పూర్తిగా వ్యతిరేకించే పాత్ర ఇది. ఇలా ఆధునిక కథల్లో పౌరాణిక కథల్లో చాలా భాగం పురాణ స్త్రీల విముక్తి, ఆర్య సంప్రదాయాల పట్ల నిరసల వ్యతిరేకత కనిపిస్తాయి.

పురాణ కథల్లో భక్తిభావం ఉంటుంది. పాపం, పుణ్యం, ఇహలోకం, పరలోకం వంటి పదాలు ప్రాధాన్యత వహిస్తాయి. మానవుడు ధర్మంతప్పక జీవించాలనీ, పరలోకంలో దేవుళ్లు మనిషి జీవితాన్ని

దర్శిస్తూనే ఉంటారని పాపపుణ్యాలను లెక్కగడుతుంటారని ఈ పురాణ సాహిత్యం చెబుతుంది. ఈ పురాణ కథల్లో ఇటువంటివి కూడా మనకు దర్శనం ఇస్తాయి. మనిషి దేవుని ఆరాధించే తత్వాన్నిపెంపొందిస్తాయి. ఉఫ్ వెంట్రుక (కె.వి.నరేందర్) కథలో భక్తులు దేవుళ్లకు సమర్పించే తలనీలాలు, వాటి కష్టాలు, అవమానాలు విదితం అవుతాయి. 'కానుక' (ముళ్ళపూడి వేంకట రమణ) కథలో సామాన్య భక్తులు గొప్పన తన నైపుణ్యంతో పిల్లనగ్రోవిని తయారుచేసి కృష్ణుడికి కానుకగా ఇవ్వడం ఉంది. "నిజమే కానీ ప్రభూ" (ములగాడ సురేశ్ కుమార్) కథలో భక్తులు దేవుని ద్వారా తమ కోరికలు తీర్చుకుంటూ మొక్కులు మాత్రం చెల్లించడం లేదనే భావన కనిపిస్తుంది. 'రాజమాత' (పిలకా గణపతిశాస్త్రి) కథలో మహభారత యుద్ధం తరువాత పాండవులకు రాజ్యభారాన్ని అప్పగించి ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవి, సంజయుడు, విదురుడు ... శేషజీవితాన్ని గడపడం కోసం, వనవాసం వెళ్ళడం కనిపిస్తుంది. అలాగే 'రససిద్ధి (భార్గవీరావు) కథలో శ్రీకృష్ణునిపై చూపే భక్తితత్వం 'శఠగోపం' (పులిగడ్డ శ్రీరామ చంద్రమూర్తి) కథలో భక్తులు దేవుళ్లకు ముడుపులు చెల్లించడంలో శఠగోపం పెట్టడం, 'అహంకారం' (బండారు సదాశివరావు) కథలో కౌశికుడు యొక్క అహంకారం కనిపిస్తుంది. ఈ భక్తిభావం కథలన్నింటిలోనూ దేవ మానవ సంబంధాలు కనిపిస్తాయి.

పురాణ ఇతిహాసాల్లో దేవుళ్లకూ, దేవ దానవులకూ, రాజ్యాల కోసం, స్త్రీలకోసం, మంత్రశక్తుల కోసం, ధర్మాధర్మాల కోసం, వైదిక ధర్మ పరిరక్షణ కోసం యుద్ధాలు సాగాయి. ఈ యుద్ధాలను కూడా ఆధునిక పౌరాణిక కథలు రికార్డు చేశాయి. 'ఇదండి దీపావళి' (వరిగొండ కాంతారావు) కథలో శ్రీకృష్ణుడు సత్యభామలు నరకాసురుని వధించటం, 'కర్ణోపదేశం (పిలకా గణపతిశాస్త్రి) కథలో మహాభారత యుద్ధానికి ముందు శ్రీకృష్ణుడు కర్ణుని జన్మ రహస్యాన్ని చెప్పి పాండవుల వైపు రమ్మని కోరడం, 'కుశుకుముద్వతి' (ఓగేటి ఇందిరా దేవి) కథలో కుశుడు నాగకన్య కుముద్వతిని వివాహ మాడటం 'విలుకత్తె సీత (యస్.జయ) కథలో సీతకు విలువిద్యలో ఉన్న నైపుణ్యాన్ని తెలపడం, 'శివకేశవ యుద్ధం' (అనంత రామచంద్రయ్య) కథలో మాతంగుడు యుద్ధంలో విష్ణువు చేతిలో మరణం పొంది కలియుగంలో బుద్ధుడిగా జన్మించడం, 'సతీ పరాభవం' (బండారు సదాశివరావు) కథలో పార్వతి మరణానికి ఆవేశం పొందిన శివుడు దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేయడం వంటి అంశాలు కనిపిస్తాయి.

అలాగే 'ఏకలవ్య' (సతీష్‌చందర్) కథలో ద్రోణాచార్యుడు ఏకలవ్యుని చేసిన మోసం, 'మాతంగ' (సౌధా) మాతంగముని జీవితం, 'కశ్మీరాః పార్వతి' (కస్తూరి మురళీకృష్ణ) కథలో ద్వాపర యుగాంతాన ఆరంభమైన మ్లేచ్ఛమత వ్యాప్తి, అస్పృశ్యత వంటి అంశాలు కన్పిస్తాయి.

భారతీయ సమాజంలో వేల సంవత్సరాల నుండి ఆచారాలు, సంప్రదాయాలు ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంగానే వస్తూనే ఉన్నాయి. ఈ సంప్రదాయాలు కూడా తెలుగు పౌరాణిక కథల్లో కథాంశాలుగా ఒదిగిపోయాయి. 'శ్రీరాముడి మూర్ఛ' (రావి ఎన్. అవధాని) కథలో శ్రీరాముడు సీతను శీలపరీక్ష కోరడం, 'హనుమంతుని నవ్వు' (రావి ఎన్. అవధాని) నవ్వు నాలుగు విధా చేటు అనే సామెత హనుమంతుని ద్వారా పుట్టడం, 'ఇదీ యజ్ఞం' (బండారు సదాశివరావు) కథలో ధర్మరాజు చేపట్టిన రాజసూయ యాగాన్ని ముంగిస తప్పు పట్టడం, 'ఇంద్రప్రస్థంలో సీమంతం' (పెమ్మరాజు వేణుగోపాలరావు) కథలో ఇంద్రప్రస్థ పురంలో సుభద్రకు సీమంతం జరగడం లాంటివి ఇతివృత్తాలు దర్శనమిస్తాయి.

ఈ కథల్లోని ఇతివృత్తాలు పౌరాణికాలయినా శిల్పపరంగా ఆధునిక కథా లక్షణాలు సంతరించుకున్నాయి. అలాగే ఆధునిక సమాజంలో సాగుతున్న స్త్రీవాద ఉద్యమాల తాలూకు భావనలు ఈ కథలో కనిపిస్తాయి. ఈ కథలు స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, స్వయంశక్తి, భక్తిభావం, మానవత్వం, శాస్త్రీయ దృక్పథం వంటి సమకాలీన సామాజిక సమస్యల పట్ల ప్రభావాన్ని చూపుతాయి. స్వార్థం, సంకుచిత మనస్తత్వం కారణంగా మనుషుల మధ్య మానవతా విలువలు లుప్తమవుతున్న ఈ సమాజానికి భక్తిని మానవతా విలువలను ఇంజెక్ట్ చేయడానికి ఈ పౌరాణిక కథా సాహిత్యం ఒక దిక్సూచిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**